ఘనంగా భోగి సంబురాలు



ఘట్‌కేసర్‌లో.. గొబ్బెమ్మలను అలంకరిస్తున్న మహిళలు

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలో భోగి పర్వదినం సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారు జాము నుంచే నూతన దుస్తులు ధరించి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బిళ్లను పెట్టారు. ముగ్గుల మధ్యలో రేగి పండ్లు, నవధాన్యాలు, చెరుకుగడలతో అందంగా అలంకరించారు.

శ్మశానవాటిక పనుల నిలిపివేత



శ్మశాన వాటిక పనులు చేపట్టిన ప్రదేశం

పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని వసంత వ్యాలీ కాలనీలో గల ఖాళీ స్థలంలో శ్మశాన వాటిక నిర్మించేందుకు జరుగుతున్న పనులను కాలనీవాసులు అడ్డుకున్నారు. సర్వే నెంబర్‌ 71, 75లోని 30 గుంటల ఖాళీ స్థలాన్ని పార్కు కోసం వినియోగించాలని గతంలో కోరినట్టు స్థానికులు తెలిపారు. దీంతో ఖాళీ స్థలంపై వివాదం తలెత్తడంతో కోర్టులో కేసు వేశామని, ఈ విషయం ఘట్‌కేసర్‌ మండల తహసీల్దారుతో పాటు జిల్లా కలెక్టర్‌ దృష్టిలోనూ ఉందన్నారు. మున్సిపాలిటీకి సంబంధం లేకుండా కొందరు వ్యక్తులు చందాలు వసూలు చేసి నిర్మాణ పనులు చేపట్టారని చెప్పారు. వసంత వ్యాలీ కాలనీకి కేటాయించిన స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వంశీ కృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో పనులను నిలిపివేశారు. అసోసియేషన్‌ సభ్యులు సారయ్య గౌడ్‌, పవన్‌, యశ్వంత్‌, ఆంజనేయులు, కనకరాజు, వెంకట ప్రసాద్‌, శ్రీనివాసులు, పార్థసారథి, పవన్‌ కుమార్‌, గంగరాజు, అజయ్‌ కుమార్‌, కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

మల్లాపూర్‌: నాచారం జాన్‌పాషా దర్గాలో హజరత్‌ సయ్యద్‌ జాంపాక్‌ షహీద్‌ ఉర్సు ఉత్సవాల్లో మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి, హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్‌ ప్రభుదాస్‌, గ్రేటర్‌ కాంగ్రెస్‌ నేత నెమలి అనిల్‌కుమార్‌ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం చిల్లా హజ్రత్‌ జాన్‌ఫక్‌ షహీద్‌ ఆశీర్వాదం తీసుకున్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడు గౌస్‌ తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీ మంద జగన్నాథంకు నివాళి

కాప్రా: నాగర్‌కర్నూలు మాజీ ఎంపీ మంద జగన్నాథం మృతిపై ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతాపం ప్రకటించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వెలుగు గుట్ట అమ్మవారి బోనాలు

ఉప్పల్‌: కురుమ సంఘం ఆధ్వర్యంలో వెలుగు గుట్ట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి, వెలుగుగుట్ట అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రముఖ ఒగ్గు కళాకారుడు శ్రీకాంత్‌ బృందం ఒగ్గు కథలను ఇంపుగా చెప్పారు. డోళ్లు, నృత్యాలు, చేస్తూ.. అమ్మవారి దర్శనం చేసుకున్నారు. కురుమ సంఘం ప్రతినిధులు గొరిగే కృష్ణ, మల్లేష్‌ , వెంకటేష్‌, జన్ని రఘు, బర్ల కృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యం సాధిస్తేనే ఉన్నత అవకాశాలు

కుషాయిగూడ: నైపుణ్యతను సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు సొంతం అవుతాయని ఎన్‌టీపీసీ సీజీఎం చందన్‌కుమార్‌ సమంత అన్నారు. రామగుండం ఎన్‌టీపీసీ సహకారంతో చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'సెంట్రల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ పెట్రో కెమికల్స్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ' (సిపెట్‌)లో ప్లాస్టిక్‌ ఉత్పత్తులపై 40 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం సర్టిఫికెట్లతో పాటు ప్లేస్‌మెంట్‌ పత్రాలను అందజేశారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సిపెట్‌ పనితీరు అభినందనీయమన్నారు. సిపెట్‌ మేనేజర్‌ ఆంజనేయశర్మ, ఎన్‌టీపీసీ ఏజీఎం బిజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.



మేడ్చల్‌–శామీర్‌పేట్‌ సరిహద్దులోని క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం



విద్యుత్‌ కాంతులతో ఆలయం



జాతర సందర్భంగా వెలసిన దుకాణ సముదాయాలు

జాతరకు ముస్తాబైన

క్షేత్రగిరి వెంకన్న

రేపటి నుంచి షురూ



మేడ్చల్‌రూరల్‌: క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతీ ఏటా సంక్రాంతి పండగ మరుసటి రోజైన కనుమ రోజున పెద్ద ఎత్తున స్వామివారి జాతర నిర్వహించడం పూర్వ కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. మేడ్చల్‌–శామీర్‌పేట్‌ మండలాల సరిహద్దు గ్రామాలైన ఘనాపూర్‌–మజీద్‌పూర్‌ గ్రామాల మధ్య ఎత్తైన కొండపైన ఉన్న వేంకటేశ్వరస్వామి భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తుండడంతో రెండు మండలాల ప్రజలు నిత్యం స్వామి వారికి పూజలు చేసేందుకు, మొక్కులు చెల్లించుకునేందుకు తరలివస్తుంటారు. ప్రతీ ఏటా కనుమ రోజున నిర్వహించే జాతర ఉత్సవానికి మేడ్చల్‌, శామీర్‌పేట్‌ మండలాలతో పాటు సిద్దిపేట, నల్లగొండ జిల్లాల ప్రజలతో పాటు నగరం నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. క్షేత్రగిరిపై విశాలవంతమైన స్థలం, పచ్చని వాతావరణం ఉండడంతో వేల సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం మేడ్చల్‌, శామీర్‌పేట్‌ మండలాల అధికారులు జాతరకు అన్ని ఏర్పాటు పూర్తి చేస్తున్నారు. భక్తులకు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్‌, దర్శనం, వసతుల కల్పనపై ఆలయ ఈవో, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సుదర్శన్‌రావు, అధికారులు దృష్టి పెట్టి పనులను చకచకా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే టెంకాయలు, ప్రసాదాల విక్రయం కొరకు పార్కింగ్‌, దుకాణ సముదాయాల ఏర్పాటుకై వేలం పాట నిర్వహించారు.

క్షేత్రగిరి ప్రత్యేకత

క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం ఎత్తైన కొండమీద ఉండడంతో మేడ్చల్‌–శామీర్‌పేట్‌ మండలాల ప్రజలకు కిలోమీటర్ల దూరం నుంచే ఆలయం దర్శనమిస్తుండడంతో భక్తులు క్షేత్రగిరి పైకి వెళ్లాలని, ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించవచ్చని భావించి నిత్యం తరలివస్తుంటారు. క్షేత్రగిరిపై విశాలమైన వాతావరణం ఉండడంతో పాటు ఎటు చూసినా ఫారెస్ట్‌ కనబడుతుండడంతో ప్రకృతి అందాలు భక్తులను కనివిందు చేస్తాయి. శామీర్‌పేట్‌ పెద్ద చెరువు సమీపంలోనే క్షేత్రగిరి ఉండడంతో నగరం నుంచి పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఇక్కడ సతీసమేతంగా వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు శని, రాహు, కేతుల విగ్రహాలతో కూడిన ప్రత్యేక ఆలయాలు ఉన్నాయి. వీటితో పాటు ఆంజనేయస్వామి, గరుడవాహనం, గోమాత, శంఖుచక్రం, గృహలోపల వీరభద్రస్వామి, ఆత్మలింగం తదితర ఆలయాలు ఉండడంతో నిత్యం భక్తులు విచ్చేసి పూజలు చేస్తుంటారు. గత కొంత కాలంగా ప్రతీ శనివారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపడుతుండడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు.



గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గోదా కల్యాణం..

క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి పచ్చని తోరణాలు, విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గణపతి శివశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు సోమవారం గోదాదేవి కళ్యాణము, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారి సామూహిక కళ్యాణం, సాయంత్రం కుంకుమార్చన, 15న కనుమ పండగ సందర్భంగా స్వామి వారి జాతర ఉత్సవాలను నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రవాణా సౌకర్యం, పార్కింగ్‌, వైద్యం, త్రాగునీరు వంటి అన్ని వసతులు ఏర్పాటు చేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ, నిర్వాహకులు తెలిపారు.



యంనంపేట్‌లో.. గోదాకల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కనులపండువగా గోదాదేవి కల్యాణం

పోచారం: యంనంపేట్‌లోని గోదాసమేత రంగనాయక స్వామి ఆలయంలో సోమవారం గోదా కల్యాణం కనులపండువగా జరిగింది. మాజీ మంత్రి, మేడ్చల్‌ శాసన సభ్యుడు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోదాదేవి రంగనాయక స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ కొండల్‌ రెడ్డి, ఆలయ చైర్మన్‌ మంజుల శ్రీశైలం, కౌన్సిలర్లు ధనలక్ష్మి సాయిరెడ్డి, రవీందర్‌, ఆలయ మాజీ చైర్మన్‌ రాజేష్‌ గౌడ్‌, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌ రెడ్డి, నాగార్జున, బొక్క బుచ్చిరెడ్డి, రామకృష్ణాచారి, ఈఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కీసర: చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవంను అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా నాగారం సత్యనారాయణ దేవస్థానంలో జరిగిన అమ్మవారి కల్యాణోత్సవంలో మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్లచంద్రారెడ్డి, వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌ యాదవ్‌, ఆలయ చైర్మన్‌ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్‌, కౌన్సిలర్‌ లావణ్య, భక్తులు పాల్గొన్నారు.

గోదా రంగనాథస్వామి కల్యాణం

మేడ్చల్‌/శామీర్‌పేట్‌: గోదా రంగనాథస్వామి కల్యాణం సోమవారం కన్నుల పండువగా జరిగింది. మేడ్చల్‌, గౌడవెల్లిలో గల రామానుజ స్వామి ఆలయంలో గత నెల రోజులుగా ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కుంతీపురం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజల శ్రేయస్సు కొరకు కల్యాణాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌, సత్యనారాయణరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, నరేంద్రచారి, సుదర్శన్‌రెడ్డి, ఆకుల కృష్ణ, గ్రామపెద్దల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





నాగారం సత్యనారాయణ స్వామి ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవం



గౌడవెల్లిలో.. రంగనాథస్వామి కల్యాణం

కార్పొరేషన్‌ పాలనకు

ఇక 15 రోజులే ..

ఈ నెల 26తో ముగియనున్న కార్పొరేటర్ల పదవీకాలం

- గడిచిన 5 ఏళ్లు పాలనవైపు అడుగేయని పాలకవర్గం
- అవిశ్వాసాలతో ఇరువర్గాలు 'రెఢీ'
- కార్పొరేటర్లకు కాసుల పంట
- ఇరుకు గదుల్లో పాలన.. కనిపించని అభివృద్ధి



ఎన్నికల అనంతరం మేయర్‌గా నియామకమైన మేకల కావ్య



అవిశ్వాస అనంతరం మేయర్‌గా నియామకమైన దొంతగాని శాంతి



ఇరుకు గదుల్లో జవహర్‌నగర్‌ మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం



జవహర్‌నగర్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడంతో జవహర్‌నగర్‌ మున్సిపల్‌ రాజకీయం ఎన్నో మలుపులు తిరిగింది. అప్పటి వరకు మేయర్‌, డిప్యూటీ మేయర్‌తో సహా పాలవర్గమంతా బీఆర్‌ఎస్‌ వైపే ఉన్నా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి బీఆర్‌ఎస్‌ నుంచే పోటీ చేసి గెలుపొందినా జవహర్‌నగర్‌ మేయర్‌ పీఠాన్ని మాత్రం కాపాడుకోలేపోయారు. 2024 సంవత్సరంలో మున్సిపల్‌లో పాలకవర్గాల పదవీకాలం నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో మున్సిపల్‌ చట్టంలో ఉన్న వెలుసుబాటును ఆసరాగా చేసుకుని అవిశ్వాస తీర్మాణానికి మరోసారి కార్పొరేటర్లు ప్రతిపాదించి సొంత పార్టీకి చెందిన మేయర్‌నే దించి తిగుబాటు ఎగురవేశారు. దీంతో అసంతృప్తుల డిమాండ్లు నెరవేర్చుకునేందుకు అవిశ్వాస బాట పట్టి గతంలో మేయర్‌, డిప్యూటి మేయర్‌ పదవుల కోసం ప్రయత్నించి చివరి క్షణంలో చేజార్చుకున్న వారంతా పరిస్థితిని అవకాశంగా మలచుకుని మేయర్‌ పీఠాన్ని మార్చేశారు.



జవహర్‌నగర్‌ మున్సిపల్‌ కార్యాలయం



ఎమ్మెల్యే మల్లారెడ్డికి తలనొప్పిగా మారిన అవిశ్వాసం

గతంలో మేడ్చల్‌ ఎమ్మెల్యేగా గెలిచిన మల్లారెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టి తనకు ఇష్టం వచ్చిన వారిని మేయర్‌, చైర్మన్‌ పదవులను అప్పగించడంతో చాలా మంది ప్రజాప్రతినిధులు నిరుస్సాహంగా ఉన్నారు. దీంతో ఆ పార్టీలో కొనసాగుతూనే రెబల్‌గా తయారై ఎమ్మెల్యేకు సవాల్‌ విసిరారు.

బీఆర్‌ఎస్‌కు షాకింగ్‌...

సొంత పార్టీకి చెందిన బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లే అదే పార్టీకి చెందిన మేయర్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అటు పార్టీ అదిష్టానం కానీ అప్పటి మంత్రి మల్లారెడ్డి ఈ సమస్యను ఎలా గట్టెక్కిస్తారని పలువురు ఎదురు చూడగా క్యాంపు రాజకీయాలతో కాస్తా మేయర్‌ పదవి కాంగ్రెస్‌ కైవసం చేసుకుంది.

అంచనాలు తారుమారు..

2020 సంవత్సరంలో నూతన పాలకవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఇండిపెండెంట్లు ముగ్గురు, 21 మంది బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లు ఉండగా, రెండు సంవత్సర క్రితం ఇండిపెండెట్లతో పాటు కాంగ్రెస్‌ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కేటీఆర్‌, మల్లారెడ్డి చేతులమీదుగా బీఆర్‌ఎస్‌ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పాలకవర్గంలో 26 మంది బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లే ఉన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం మేయర్‌ డిప్యూటీ మేయర్‌తో పాటు 18 మంది కాంగ్రెస్‌ కార్పొరేటర్లు ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లోకి కార్పొరేటర్‌

అసెంబ్లీ ఎన్నికలకు ముందు 28వ డివిజన్‌ కార్పొరేటర్‌ నిహారికగౌడ్‌ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌ రెడ్డి, మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌, జవహర్‌నగర్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు శ్రీకాంత్‌ యాదవ్‌ల నేతృత్వంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకుంది. ఆమెతో పాటు మాజీ సర్పంచ్‌ శంకర్‌గౌడ్‌ సైతం పార్టీలో చేరారు. దీంతో జవహర్‌నగర్‌ రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది.

కార్పొరేటర్లకు కాసుల పంట..

రాజకీయంలో ఎలాంటి అనుభవం లేకున్నా అప్పటి మంత్రి మల్లారెడ్డి చెబితేనే మేయర్‌గా మేకల కావ్యకు మద్దతిచ్చామని అసమ్మతి కార్పొరేటర్లు అన్నారు. క్యాంపు రాజకీయాలు కార్పొరేటర్లకు కాసుల పంటైంది. మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని 20 మంది కార్పొరేటర్లు సంతకంపెట్టి క్యాంపు రాజకీయాలకు తెరలేపడంతో క్యాంపుకు వెళ్లిన అసమ్మతి కార్పొరేటర్లకు నూతనంగా మేయర్‌ శాంతిని ఎన్నుకోవడంతో కాసులపంట పండింది.

ఇరుకు గదుల్లో పాలన..

గడిచిన 5ఏళ్లలో పాత, కొత్త పాలకవర్గాలు పాలనవైపు అడుగులు వేయలేదు. కనీసం కార్పొరేషన్‌లో 28 మంది కార్పొరేటర్లు కూర్చుని చర్చించుకోవడానికి సరైన హాల్‌ కూడా లేకపోవడంతో కౌన్సిల్‌ సమావేశాన్ని సైతం సమీపంలో ఉన్న డ్వాక్రా భవనంలో ఏర్పాటు చేసి 5 ఏళ్ల పాలన ముగించారు. గ్రామపంచాయతీ భవనాన్ని మరమ్మతు చేసి కాలం వెళ్లదీశారే కానీ నూతన భవనాన్ని కట్టలేకపోయారు.

వందల ఎకరాలు ఉన్నా పట్టింపులేకపాయె..

జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లో దాదాపు 3లక్షల జనాభ నివసిస్తున్నారు. వీటిలో 50 కాలనీపైగా ఉన్నాయి. అక్కడక్కడ డ్రైనేజీ, సీసీ రోడ్లు వేశారు. ఇంకా చాలా కాలనీలు అధ్వానస్థితిలో ఉన్నాయి. ఇక్కడ రిజిస్ట్రేషన్‌కు అనుమతులు లేకపోవడంతో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడిపోయింది. బిట్స్‌పిలానీ, డంపింగ్‌ యార్డ్‌, స్థానిక ప్రజల నుంచి వచ్చే టాక్స్‌ల ద్వారానే మున్సిపల్‌ కార్యాలయ సిబ్బంది జీతాలు చెల్లించేపరిస్థితి నెలకొంది.

ప్రతిపాదనలకే పరిమితమైన 100 పడకల ఆసుపత్రి

గత 5 సంవత్సరాలు పాలకవర్గంలో వర్గపోరు వల్ల అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. ఇక్కడి వచ్చిన 100 పడకల ఆసుపత్రి, మినీ స్టేడియం, లైబ్రరీ, పార్క్‌, మార్కెట్‌ స్థలాలను సైతం ఏర్పాటు చేయలేదు. ఇంకా అంగన్‌వాడీ, సబ్‌సెంటర్లు కిరాయి ఇండ్లలో నడిపిస్తున్నారంటే అభివృద్ధి ఎంతమేరకు జరిగిందో తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వీటి విషయాలలో శ్రద్ధ తీసుకుని మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి వైపు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.